సాక్షి నంద్యాల

బుధవారం : 18 : జనవరి : 2023



సంక్రాంతి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శ్రీశైలంలో చండీశ్వరస్వామికి సరస్వి పుష్కరిణిలో శాస్త్రోక్తంగా అవభృతస్నాన కార్యక్రమ దృశ్యం



శ్రీభ్రమరాంబా మల్లికార్జున స్వామివార్ల ఉత్సవ మూర్తులకు మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న అర్చకులు, ఈఓ



శ్రీశైల మల్లన్న ధ్వజస్తంభాన్ని మొక్కుతున్న దేవదాయశాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ

న్యూస్‌రీల్

గందరగోళంగా కౌన్సెలింగ్

కర్నూలు కల్చరల్: ఉమ్మడి కర్నూలు జిల్లాలో ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయుల వర్క్ అడ్జెస్ట్ మెంట్ కౌన్సెలింగ్ ప్రక్రియ గందరగోళంగా మారింది. విద్యాశాఖ అధికారుల అవగాహన రాహిత్యం ఇందుకు కారణమని తెలుస్తోంది. మంగళవారం ఏక్యాంప్ పాఠశాలలో పని సర్దుబాటు ప్రక్రియ, అడహక్ పదోన్నతుల కౌన్సెలింగ్ నిర్వహించారు. అయితే రాష్ట్రంలో ఏ జిల్లాలో కూడా లేని విధంగా ఉమ్మడి కర్నూలు జిల్లాలో నిర్వహించిన కౌన్సెలింగ్ డీఈవో, సంబంధిత అధికారుల అవగాహన రాహిత్యం, నిర్లక్ష్య వైఖరితో అస్తవ్యస్తంగా మారింది. పదోన్నతులకు అర్హులైన వారికి జిల్లాలోని అన్ని ఖాళీల వివరాలను ప్రకటించక పోవడంతో ఉపాధ్యాయ వర్గాలను తీవ్ర ఆందోళనకు గురి చేసింది. ఇక్కడ మాత్రం డీఈవో నిర్లక్ష్యంతో కౌన్సెలింగ్ ప్రక్రియ అలస్యమైనట్లు తెలుస్తోంది. ఖాళీల వివరాలు, అడహక్ పదోన్నతుల వివరాల జాబితాల్లో తప్పులు చోటు చేసుకోవడంతో కొన్ని సబ్జెక్టుల కౌన్సెలింగ్ బుధవారానికి వాయిదా వేశారు. 70 శాతం పదోన్నతుల్లో 641 మంది, ఉపాధ్యాయుల కన్వర్షన్ విభాగంలో65 మంది, సర్‌ప్లస్‌లో 54 మంది మొదటి రోజు మొత్తం 760 మంది టీచర్లకు కౌన్సెలింగ్ నిర్వహించినట్లు తెలుస్తోంది.

ఈఆర్‌సీ విచారణపై అవగాహన

కర్నూలు(రాజ్‌విహార్): విద్యుత్‌పై సమగ్ర ఆదాయ ఆవశ్యకత, టారీఫ్, కాస్ట్ సబ్సిడీ సర్‌చార్జీల ప్రతిపాదనలపై ఈనెల 19వ తేదీ నుంచి మూడు రోజుల పాటు నిర్వహించే విచారణ కార్యక్రమంపై అవగాహన కల్పించారు. ఆంధ్రప్రదేశ్ ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమిషన్ (ఏపీ ఈఆర్‌సీ) ఆన్‌లైన్ ద్వారా నిర్వహిస్తున్న కార్యక్రమంపై ఉన్నతాధికారులు మంగళవారం డెమో ద్వారా అవగాహన కల్పించారు. ఆ మూడు రోజుల్లో ఎలాంటి సాంకేతిక, ఆన్‌లైన్ సమస్యలు రాకుండా ఏర్పాట్లు చేశామని దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ కర్నూలు ఆపరేషన్స్ ఎస్ఈ ఎం. ఉమాపతి పేర్కొన్నారు. 2023–24 వార్షిక సంవత్సరానికి గాను విద్యుత్ పంపిణీ సంస్థలు చేసిన ప్రతిపాదనలపై ఈఆర్‌సీ విచారణ చేపడుతోంది. సూచనలు, అభ్యంతరాలు, సలహాలు వ్యక్తం చేయాలనుకునే వినియోగదారులు, వ్యాపారవేత్తలు, పారిశ్రామిక వేత్తలు ముందుగా ఏపీ ఈఆర్‌సీ వెబ్‌సైట్ / మెయిల్‌లో రిజిష్టర్ చేసుకోవాలని సూచించారు. ఆ తేదీల్లో కర్నూలు సర్కిల్ కార్యాలయంలో పాటు నంద్యాల, ఆదోని, డోన్ డివిజన్ కేంద్రాల్లో వీసీ ద్వారా పాల్గొనేందుకు ఏర్పాట్లు చేయనున్నట్లు వెల్లడించారు.

విజయడెయిరీ పాలక మండలి సభ్యుల ఎన్నిక ఏకగ్రీవం

నంద్యాల(అర్బన్): విజయడెయిరీలో ఖాళీగా ఉన్న మూడు పాలక మండలి సభ్యుల ఎన్నిక ఏకగ్రీవమైనట్లు ఎన్నికల అధికారి హరిబాబు మంగళవారం తెలిపారు. స్థానిక కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఇంజేడు, గోపవరం, సుంకేసుల గ్రామాల్లోని మార్క్ఫ్ సహకార సంఘం అధ్యక్ష పదవులకు మంగళవారం మూడు నామినేషన్లే దాఖలయ్యాయన్నారు. ఇందులో ఇంజేడుకు విశ్వనాథరెడ్డి, గోపవరానికి సుబ్బరాయుడు, సుంకేసులకు నాగేశ్వరరెడ్డి నామినేషన్లు దాఖలు చేశారన్నారు. మూడు స్థానాలకు ముగ్గురు మాత్రమే నామినేషన్లు వేయడంతో వారిని ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ప్రకటించామన్నారు.

యాగ పూర్ణాహుతి కార్యక్రమం నిర్వహిస్తున్న శ్రీశైల దేవస్థానం ఈఓ లవన్న, అర్చకులు, వేద పండితులు





ధ్వజావరోహణ నిర్వహిస్తున్న దృశ్యం



వేదాలు చదువుతున్న పండితులు

బ్రహ్మోత్సవం.. శోభాయమానం

శ్రీశైలంలో వైభవంగా సాగుతున్న సంక్రాంతి ఉత్సవాలు

- ఆరో రోజు శాస్త్రోక్తంగా యాగ పూర్ణాహుతి
- సంప్రదాయబద్ధంగా సదస్యం, నాగవల్లి, ధ్వజావరోహణ
- నేడు అశ్వవాహనసేవలో దర్శనమివ్వనున్న స్వామి అమ్మవార్లు

శ్రీశైలంటెంపుల్: సంక్రాంతి బ్రహ్మోత్సవాలు శ్రీశైలంలో కనుల పండువగా సాగుతున్నాయి. ఆరో రోజు మంగళవారం యాగ పూర్ణాహుతి కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ముందుగా భ్రమరాంబా మల్లికార్జున స్వామి వార్లకు అర్చకులు, వేదపండితులు విశేష పూజలు నిర్వహించారు. అనంతరం స్వామివారి యాగశాలలో చండీశ్వరస్వామికి ప్రత్యేక పూజాదికాలు నిర్వహించారు. అటు తరువాత పూర్ణాహుతి, కలశోద్వాసన, త్రిశూలస్నానం, మహదాశీర్వచనం జరిపించారు. శాస్త్రోక్తంగా నారికేళాలు, పలు సుగంధ ద్రవ్యాలు, నూతన వస్త్రాలు మొదలైన ద్రవ్యాలను హోమగుండంలో సమర్పించి యాగపూర్ణాహుతి కార్యక్రమాన్ని పూర్తి చేశారు. అనంతరం వసంతోత్సవం నిర్వహించారు. చండీశ్వరస్వామికి సరస్వి పుష్కరిణిలో అర్చకులు, ఈఓ ఎస్.లవన్న అవభృత స్నానం చేయించారు.

వేదపండితులతో వేద స్వస్తి

సంక్రాంతి బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామి అమ్మవార్ల నిత్య కల్యాణ మండపంలో సదస్యం, నాగవల్లి కార్యక్రమాలు నిర్వహించారు. సదస్యం కార్యక్రమంలో వేదపండితులచే వేద స్వస్తి నిర్వహించారు. నాగవల్లి కార్యక్రమంలో సంక్రాంతి పర్వదినాన కల్యాణోత్సవం జరిపించబడిన అమ్మవారికి ఆగమశాస్త్ర సంప్రదాయం ప్రకారం మెట్టెలు, నల్లపూసలు సమర్పించారు. బ్రహ్మోత్సవాల ప్రారంభ సూచికంగా తొలిరోజు ఆలయ ధ్వజస్తంభంపై ఆవిష్కరింపజేసిన ధ్వజపటాన్ని మంగళవారం సాయంత్రం అవరోహణ చేశారు.

నేడు అశ్వవాహనసేవ

ఉత్సవాల్లో భాగంగా చివరి రోజు బుధవారం భ్రమరాంబా మల్లికార్జున స్వామి అమ్మవార్లు అశ్వవాహన సేవలో భక్తులకు దర్శనమిస్తారు. అశ్వవాహనంపై ఆశీనులైన స్వామి అమ్మవార్లకు ఆలయ ఉత్సవం నిర్వహిస్తారు. అనంతరం స్వామిఅమ్మవార్లకు పుష్పోత్సవం, శయనోత్సవం, ఏకాంతసేవ జరిపిస్తారు. ఆయా ఉత్సవాలతో సంక్రాంతి బ్రహ్మోత్సవాలు ముగుస్తాయి.

మల్లన్నను దర్శించుకున్న దేవదాయశాఖ మంత్రి

భ్రమరాంబా మల్లికార్జున స్వామివార్లను దేవదాయశాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ దంపతులు మంగళవారం దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. ఆలయ రాజగోపురం వద్ద దేవస్థాన ఈఓ ఎస్.లవన్న, అర్చకస్వాములు, అధికారులు ఆలయ మర్యాదలతో వారికి స్వాగతం పలికారు. అనంతరం మంత్రి దంపతులు మల్లికార్జునుడికి రుద్రాభిషేకం, భ్రమరాంబాదేవికి కుంకుమార్చన తదితర ప్రత్యేక పూజలు చేశారు. తర్వాత ఆశీర్వచన మండపంలో వారికి వేదపండితులు వేద మంత్రాలు పలకగా, అర్చకులు ఆశీర్వచనాలు, తీర్థ ప్రసాదాలు అందించి సత్కరించారు. ఈఓ స్వామివారి శేషవస్త్రాలను, లడ్డూప్రసాదాలను, జ్ఞాపికను అందజేశారు. అనంతరం ఆలయంలో మంత్రి భక్తులతో మాట్లాడి వసతి, దర్శనం, ఇతర సౌకర్యాలపై వారి అభిప్రాయం తెలుసుకున్నారు.

ఆకట్టుకున్న వేద శ్రవణం

సంక్రాంతి బ్రహ్మోత్సవాల సందర్భంగా శ్రీశైల మహాక్షేత్రంలో వేదశ్రవణం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దేవస్థాన వేద పండితులతో పాటు కాణిపాకం, శ్రీకాళహస్తి, అన్నవరం, ద్వారక తిరుమల, ఇంద్రకీలాద్రి–విజయవాడ దేవస్థానాలు, హైదరాబాద్ నుంచి మొత్తం 36 మంది వేదపండితులు పాల్గొని పారాయణం చేశారు. ముందుగా అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని ఆశీర్వచన మండపంలో అర్చకస్వాములు, వేదపండితులు లోక కల్యాణాన్ని కాంక్షిస్తూ సంకల్పం పఠించి, మహాగణపతిపూజ జరిపారు. అనంతరం జరిగిన రుత్విగ్వరణ కార్యక్రమంలో వేదపండితులకు నూతన వస్త్రాలు అందజేశారు. అమ్మవారి ఆలయ ప్రాంగణంలో వేదపఠన కార్యక్రమం జరిపారు. 3 గంటల పాటు నిరంతరాయంగా వేదపారాయణలు కొనసాగాయి. స్వామి అమ్మవార్ల కైంకర్యంగా రెండు గంటల పాటు ఘనస్వస్తి నిర్వహించారు.

గిరిజన సమస్యలు సత్వరం పరిష్కరించాలి

- నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు
- ఎస్టీ కమిషన్ సభ్యుడు శంకర్‌నాయక్
- ఐటీడీఏ అధికారుల తీరుపై ఆగ్రహం



గిరిజనులనుద్దేశించి మాట్లాడుతున్న ఎస్టీ కమిషన్ సభ్యుడు వడిత్యా శంకర్ నాయక్

కొత్తపల్లి: గిరిజనుల సమస్యలను వెనువెంటనే పరిష్కరించాలని, ఈ విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే సంబంధిత అధికారులపై చర్యలు తప్పవని ఎస్టీ కమిషన్ సభ్యుడు వడిత్యా శంకర్ నాయక్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని భ్రమరాంబా చెంచుగూడేన్ని అయన సందర్శించారు. గిరిజనులతో సమావేశమై వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. గూడెంలో విద్యుత్ స్తంభాలు, రహదారి, తాగునీటి కుళాయిలు, శ్మశాన వాటిక ఏర్పాటు చేయాలని కోరారు. అలాగే సంగమేశ్వరం సమీపంలోని కృష్ణానదిలో చేపలు పట్టుకునేందుకు అనుమతి ఇప్పించాలని కోరారు. ఆయా సమస్యలపై స్పందించిన ఎస్టీ కమిషన్ మెంబర్ ఐటీడీఏ అధికారుల పనితీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మీరు గూడేలకు సందర్శిస్తున్నారా.. లేదా ? అని ప్రశ్నించారు. ఇక నుంచి గిరిజన సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించి పరిష్కరించాలని ఆదేశించారు. ప్రభుత్వం అందిస్తున్న సహాయ సహకారాలతో పిల్లలను బాగా చదివించుకోవాలని, అప్పుడే సామాజికంగా, ఆర్థికంగా అభివృద్ధి సాధ్యమవుతుందని గిరిజనులకు సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ చంద్రశేఖర్ నాయక్, ఎంపీడీఓ మేరి, జెడ్పీటీసీ సభ్యుడు సోమల సుధాకర్ రెడ్డి, ఈఓఆర్డీ శ్రీనివాసులు నాయుడు, వెలుగు ఏపీఎం పుల్లయ్య, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ త్రిలింగేశ్వరరెడ్డి, ఐసీడీఎస్ సూపర్ వైజర్ కమల, ఐటీడీఏ ఏపీఓ రాజునాయక్, గిరిజన సమాఖ్య స్టేట్ ప్రెసిడెంట్ రాజునాయక్, గిరిజన ప్రజాసమాఖ్య నాయకులు మల్లేష్ నాయక్, రామునాయక్, మల్లికార్జున నాయక్, మల్లునాయక్, బాలునాయక్, వెంకటేష్ నాయక్, రవి నాయక్, తదితరులు పాల్గొన్నారు.

దేశభక్తి ఉప్పొంగేలా గణతంత్ర వేడుకలు



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్

నంద్యాల: దేశభక్తి ఉప్పొంగేలా ఈనెల 26న ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో భారత గణతంత్ర వేడుకలు నిర్వహించాలని జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్ అధికారులకు ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో గణతంత్ర దినోత్సవ ఏర్పాట్లపై జిల్లా ఎస్పీ రఘువీర్ రెడ్డితో కలిసి సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జాతీయ పతాక ఆవిష్కరణ, వేదిక బ్యాక్ గ్రౌండ్, సీటింగ్ తదితర ఏర్పాట్లలో జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులతో సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని డీఈఓను ఆదేశించారు. అభివృద్ధిని ప్రతిబింబిచేలా అగ్రికల్చర్, డీఆర్‌డీఏ, హౌసింగ్, వైద్య, డ్వామా తదితర శాఖల శకటాలు ఉండాలన్నారు. ఎగ్జిబిషన్ స్టాల్స్‌ను కూడా ఏర్పాటు చేయాలని సూచించారు. ఉత్తమ సేవలందించిన ఉద్యోగులకు ప్రశంసా పత్రాల జారీకి జాబితా పంపాలని అధికారులకు ఆదేశించారు. ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలపై సంక్షిప్త నివేదికలను సేకరించి సందేశ కాపీని సిద్ధం చేయాలని జిల్లా సమాచారం పౌర సంబంధాల అధికారికి కలెక్టర్ సూచించారు. కార్యక్రమంలో డీఆర్‌ఓ పుల్లయ్య, అడిషనల్ ఎస్పీ రమణ, ఆర్‌డీఓ శ్రీనివాసులు, డీఎస్పీ మహేశ్వరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గవర్నర్ పర్యటనకు పకడ్బందీ ఏర్పాట్లు

రాష్ట్ర గవర్నర్ విశ్వ భూషణ్ హరి చందన్ జిల్లా పర్యటన విజయవంతానికి పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో గవర్నర్ పర్యటన కార్యక్రమ ఏర్పాట్లపై జిల్లా ఎస్పీ రఘువీర్ రెడ్డితో కలిసి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 20వ తేదీ పాణ్యం మండలంలోని నెరవాడ మెట్ట వద్ద ఉన్న ఏపీ గిరిజన బాలికల పాఠశాలలో గిరిజనులతో గవర్నర్ ముఖాముఖి కార్యక్రమం జరుగుతుందన్నారు. ఇందులో దాదాపు 1500 మంది గిరిజనులు పాల్గొంటారని, అందుకు అనుగుణంగా చర్యలు తీసుకోవాలన్నారు. సభా వేదికతో పాటు గ్రీన్ రూం, సేఫ్ రూం, గిరిజన సంప్రదాయ స్టాళ్లు ఏర్పాట్లు చేయాలన్నారు. సంక్షేమ పథకాల ఫలాలను అర్హులైన గిరిజనులకు పంపిణీ చేసేందుకు సిద్ధం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో డీఆర్‌ఓ పుల్లయ్య, అడిషనల్ ఎస్పీ రమణ, ఆర్‌డీఓ శ్రీనివాసులు, డీఎస్పీ మహేశ్వరెడ్డి పాల్గొన్నారు.

అదనపు ఆదాయానికి తోడ్పాటు



నాలుగేళ్ల నుంచి నేను సిరి గ్రూపులో సభ్యురాలుగా ఉంటున్నాను. ప్రతి ఏటా వైఎస్సార్ క్రాంతి పథం ద్వారా బ్యాంకు లింకేజీ, స్త్రీ నిధి, ఉన్నతి ద్వారా రుణాలు మంజూరవుతున్నాయి. వీటితోపాటు అదనపు ఆదాయం చేకూర్చేందుకు ప్రభుత్వం పెరటికోళ్ల, పొట్టేలు పిల్లల పెంపకానికి రుణాలు అందజేస్తుండటం హర్షనీయం.

– కమలాదేవి, పొదుపు సంఘం సభ్యురాలు, కోవెలకుంట్ల

ప్రభుత్వ ప్రోత్సాహం



వైఎస్సార్ క్రాంతి పథం ద్వారా బ్యాంకు రుణాలు ఇవ్వడంతోపాటు అదనపు ఆదాయం చేకూరేందుకు పెరటికోళ్ల పెంపకం అన్ని విధాలుగా లాభదాయకంగా మారింది. కోళ్ల పెంపకం ద్వారా నాలుగు నెలలకు రూ.20 వేలు ఆదాయం వస్తోంది. వీటితో పాటు గొర్రె పిల్లల పెంపకానికి ప్రభుత్వం ప్రోత్సాహం కల్పిస్తోంది.

– ఉసేన్‌బీ, సాయిరాం పొదుపు, అవుకు మండలం

ఆర్థిక స్వావలంబనే లక్ష్యం



స్వయం సహాయక సంఘాల సభ్యుల జీవనోపాధికి అదనపు ఆదాయం కల్పించడమే లక్ష్యంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. ఈ పథకం ద్వారా ఎస్‌ఆర్‌ఎల్‌ఎం లాగిన్‌లో వివరాలు నమోదు చేస్తే మండల ఐక్య సంఘంలో నిధులు జమ అవుతాయి.

–బాబు, వైకేపీ ఏపీఎం, సంజామల

జీవనోపాధికి మరింత ఊతం!

రాష్ట్ర ప్రభుత్వం మహిళా సంక్షేమానికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తోంది. ఇప్పటికే వారి ఆర్థికాభివృద్ధికి పలు రూపాల్లో తోడ్పాటు అందిస్తోంది. తాజాగా పొదుపు మహిళలకు అదనపు ఆదాయం సమకూర్చేందుకు, జీవనోపాధికి భరోసా కల్పించేందుకు సీడ్ క్యాపిటల్ పథకం ద్వారా పొట్టేళ్ల పంపిణీకి శ్రీకారం చుట్టింది.

- మహిళల ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం తోడ్పాటు
- సీడ్ క్యాపిటల్ పథకం ద్వారా జీవాల పంపిణీ
- ఒక్కో యూనిట్‌కు రూ.40 వేల రుణం
- మండలానికి 50 యూనిట్లు
- పొట్టేళ్ల పెంపకంపై అవగాహన



పొదుపు మహిళలకు అవగాహన కల్పిస్తున్న అధికారులు (ఫైల్)



పొట్టేళ్లు

కోవెలకుంట్ల: పెరటికోళ్ల పెంపకం యూనిట్లు మహిళలకు మంచి ఆదాయం తెచ్చిపెడుతున్నాయి. ఇప్పటికే పలువురు ఈ యూనిట్ల ద్వారా ఆర్థికాభివృద్ధి దిశగా అడుగులు వేస్తున్నారు. తాజాగా పొదుపు మహిళలు సీడ్ క్యాపిటల్ పథకం కింద పొట్టేలు పిల్లలు పెంచుకునేందుకు అవకాశం కల్పిస్తోంది. యూనిట్‌కు రూ. 40 వేల నుంచి రూ. 75 వేల వరకు రుణం అందించనుంది. నంద్యాల జిల్లాలోని 29 మండలాల పరిధిలో 32,022 పొదుపు సంఘాలుండగా 3.20 లక్షల మంది సభ్యులు ఉన్నారు. వీరిలో పొట్టేళ్ల పెంపకంపై ఆసక్తి ఉన్న మహిళలను గుర్తించి వారికి బ్యాంకుల ద్వారా రుణ వసతి కల్పించేందుకు డీఆర్‌డీఏ అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. బ్యాంకు రుణం మంజూరైన వెంటనే పొట్టేలు పిల్లలు సరఫరా చేసే సంస్థలకు సమాచారం అందిస్తారు. బ్యాంకు రుణాలు ఆలస్యమయ్యే పరిస్థితులు ఉంటే వైఎస్సార్ క్రాంతిపథం ద్వారా స్త్రీ నిధి, ఉన్నతి, చేయూత, తదితర పథకాల ద్వారా రుణాలను మంజూరు చేయనున్నారు. ఒక్కో మండలానికి మొదటి విడతలో 50 యూనిట్ల వరకు కేటాయించి రాబోయే రోజుల్లో పథకాన్ని మరింత విస్తరించనున్నారు. ఒక్కో యూనిట్ ద్వారా మహిళలకు 7 నుంచి 10 వరకు నాణ్యమైన పొట్టేలు పిల్లలను సరఫరా చేయనున్నారు.

పశువైద్యాధికారుల సహకారం

పొదుపు మహిళలకు నాణ్యమైన పొట్టేళ్ల పిల్లలను అందించేందుకు పశువైద్యాధికారుల సహకారం తీసుకోనున్నారు. పశు సంవర్ధకశాఖ తరఫున మెడికల్ కిట్ అందజేస్తారు. పొట్టేళ్లకు జబ్బులు వస్తే తట్టుకునేలా ముందుగానే వాటికి వ్యాక్సినేషన్ చేస్తారు. బలానికి విటమిన్ల ద్రావణం, పొట్టేలు పిల్లలకు ఇన్సూరెన్స్ చేయిస్తారు. పొట్టేలు పిల్లలు పంపిణీ చేసిన 15 రోజుల్లోపు ఏ కారణంతోనైనా అవి మృత్యువాత పడితే తిరిగి ఉచితంగా అందజేసేలా కాంట్రాక్ట్ రూపొందించారు. 15 రోజుల తర్వాత మృతి చెందితే ఇన్సూరెన్స్ కంపెనీ ద్వారా నష్ట పరిహారం అందుతుంది. రైతు భరోసా కేంద్రాల్లో ఉండే పశు సంవర్ధకశాఖ సహాయకులు పొట్టేళ్లకు ఏవైనా జబ్బులు వస్తే మందులు ఎలా వాడాలి, వాటిని ఎలా రక్షించుకోవాలో సూచనలు, సలహాలు ఇస్తారు.

పెరటికోళ్ల పెంపకం విస్తరణ

పొదుపు మహిళలకు అదనపు ఆదాయం చేకూర్చాలన్న ఉద్దేశంతో కేవలం రూ. 4 వేలతోనే 11 మేలు జాతి కోళ్లను ఒక యూనిట్‌గా అందజేశారు. వీటి పెంపకం ద్వారా నాలుగు నెలల్లోనే రూ. 20 వేల వరకు ఆదాయం వచ్చింది. మరిన్ని పొదుపు సంఘాలకు యూనిట్లు కేటాయించేందుకు వైఎస్సార్ క్రాంతి పథ అధికారులు కసరత్తు చేస్తున్నారు. కోళ్ల పెంపకంపై అవగాహన కల్పించి పథకాన్ని మరింత విస్తరించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. కోళ్ల పెంపకంతో పాటు పొట్టేళ్ల పంపిణీపై దృష్టి సారించారు. ఒక్కో మండలానికి 50 యూనిట్లు కేటాయించి త్వరలో ఈ పథకాన్ని ప్రారంభించనున్నారు.

నియోజకవర్గాల వారీగా పొదుపు గ్రూపుల వివరాలు

నియోజకవర్గం	పొదుపు సంఘాలు
బనగానపల్లె	6,716
నంద్యాల	2,604
ఆళ్లగడ్డ	5,539
శ్రీశైలం	4,438
డోన్	4,924
నందికొట్కూరు	5,670
పాణ్యం/గడివేముల	2,131

రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు

ఆళ్లగడ్డ: జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు మరిన్ని భద్రతా చర్యలు తీసుకుంటామని నంద్యాల జిల్లా ఎస్పీ రఘువీర్‌రెడ్డి అన్నారు. చాగలమర్రి పోలీస్ స్టేషన్‌ను మంగళవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టేషన్ పరిసరాలు, రికార్డులను పరిశీలించి అధికారులకు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జాతీయ రహదారిపై ప్రమాదాలు జరగకుండా చూడాలన్నారు. శాంతిభద్రతల పరిరక్షణ, మహిళలు, వృద్ధులు, చిన్నపిల్లల సమస్యల పరిష్కారానికి అధిక ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమాల ద్వారా ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. చట్ట వ్యతిరేక, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారు ఎంతటి వారైన ఉపేక్షించవద్దని పోలీసులను ఆదేశించారు. ఆయన వెంట డీఎస్పీ సుధాకర్‌రెడ్డి, ఎస్ఐ సత్యనారాయణ ఉన్నారు.

గ్రంథాలయ చైర్మన్ ఆకస్మిక తనిఖీ

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని గ్రంథాలయాన్ని మంగళవారం ఉమ్మడి జిల్లా గ్రంథాలయ చైర్మన్ సుభాష్‌చంద్రబోస్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం రికార్డులు, పుస్తకాల అమరికలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. గ్రంథాలయం నిధులకు రావాల్సిన సెస్సు బకాయిల గురించి అడిగి తెలుసుకున్నారు. వెంటనే బకాయిలు చెల్లించేలా మున్సిపల్ అధికారులను సంప్రదించాలని ఆదేశించారు. అదే విధంగా పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులతో ముచ్చటించి వారికి కావాల్సిన మెటీరియల్‌ను సత్వర కాలంలో అందజేస్తామన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి పద్మావతి, శ్రీధర్, తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

కోసిగి మీదుగా మణుగూర్ ఎక్స్‌ప్రెస్


మాట్లాడుతున్న స్టేషన్ మాస్టార్ దిలీప్ కుమార్

కోసిగి: బెల్గాం - సికింద్రాబాద్ మధ్య మంగళవారం ప్రారంభమైన మణుగూర్ ఎక్స్‌ప్రెస్ రైలు కోసిగిలో ఆగనున్నట్లు కోసిగి రైల్వే స్టేషన్ మాస్టార్ దిలీప్ కుమార్ తెలిపారు. సౌత్ సెంట్రల్ రైల్వే అధికారుల ఉత్తర్వుల మేరకు బెల్గాం - సికింద్రాబాద్ (07335) రైలు కోసిగికి రాత్రి 11.19 గంటలకు చేరుకుంటుందని, సికింద్రాబాద్- బెల్గాం మధ్య నడిచే (07336) ఎక్స్‌ప్రెస్ రైలు తెల్లవారుజామున 4.20 గంటలకు వస్తున్నట్లు తెలిపారు. ఈ రైలు మార్చి నెలాఖరు వరకు కొనసాగుతోందన్నారు. ప్రయాణికుల రద్దీ కొనసాగితే రైలును యథావిధిగా కొనసాగుతున్నట్లు తెలిపారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాల అభివృద్ధికి కృషి

- ప్రకటించిన పూర్వ విద్యార్థులు



డోన్: గుండా వెంకటరత్నమయ్య శెట్టి ప్రభుత్వ డిగ్రీ కళాశాల సమగ్ర అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తామని పూర్వ విద్యార్థులు ప్రకటించారు. ఈనెల 22న పెద్ద ఎత్తున పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించి చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై చర్చించనున్నట్లు వెల్లడించారు. మంగళవారం స్థానిక రోటరీక్లబ్ ఆవరణలో పూర్వ విద్యార్థులు కొండా సురేష్, ఆలా మోహన్‌రెడ్డి, వరిగడ్డి వెంకటేశ్వర్లు, ఆంజనేయులుతో కలిసి పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆహ్వాన కమిటీ అధ్యక్షుడు ఆలంకొండ నబీ విలేకరులతో మాట్లాడారు. 1978 నుంచి 1986 మధ్య ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యను అభ్యసించిన పూర్వ విద్యార్థులు, నాటి అధ్యాపకులు ఈ సమ్మేళనానికి హాజరవుతున్నట్లు వారు తెలిపారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అన్ని రకాల వసతులు ఉన్నా విద్యార్థుల సంఖ్య నానాటికి తగ్గిపోతుండటంపై ఆందోళన వ్యక్తం చేశారు. కాలేజీకి పూర్వ వైభవం తీసుకొచ్చేందుకు విద్యార్థులకు వసతితో పాటు ఫలహారం, భోజన సౌకర్యం కల్పించాలని నిర్ణయించినట్లు వెల్లడించారు.

పరిమళిస్తున్న వ్యాపారం



ఊదిబత్తీలు చూపిస్తున్న ఈమె పేరు అరుణ. కర్నూలు మండలం దిన్నెదేవరపాడు గ్రామానికి చెందిన పొదుపు మహిళ. ఆదర్శ స్వయం సహాయక సంఘంలో ఉన్నారు. వైఎస్సార్ చేయూత, ఆసరా, సున్నా వడ్డీ, జగనన్న తోడు కింద ప్రభుత్వం ఇచ్చిన ఆర్థిక తోడ్పాటుతో నంది గోల్డ్ ఊదిబత్తీల తయారీ యూనిట్‌ను ఏర్పాటు చేశారు. మంచి నాణ్యత, సువాసన ఉండటంతో మార్కెట్‌లో వీటికి డిమాండ్ పెరిగింది. ప్రతి నెలా అన్ని రకాల ఖర్చులు పోను రూ.15 వేల నుంచి రూ.30 వేల వరకు మిగులు ఉంటోంది.

ఆర్థిక భద్రత



ప్యాకింగ్ మిషన్ వద్ద నిల్చున్న ఈమె పేరు శివపార్వతి. కర్నూలు మండలం సుంకేసుల గ్రామానికి చెందిన ఈమె తుంగభద్ర గ్రామైక్య సంఘంలో సభ్యురాలుగా ఉన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసిన పథకాల ద్వారా ఈమెకు వివిధ రూపాల్లో ఆర్థికచేయూత లభించింది. బ్యాంకు లింకేజీ, ఇతరత్రా రుణాలు తీసుకున్నారు. మొత్తం రూ.4.78 లక్షల వ్యయంతో కారం, పసుపు ప్యాకింగ్ మిషన్ ఏర్పాటు చేసుకున్నారు. జీవనోపాధి మెరుగుపడడంతోపాటు నెలకు రూ.30వేల ఆదాయం వస్తోంది.

మెరుగుపడిన జీవనోపాధి



దుస్తుల దుకాణంలో కూర్చున్న ఈమె పేరు ఎస్.హలీమాబీ. గోనెగండ్ల గ్రామానికి చెందిన ఈమె షాషా పొదుపు సంఘంలో సభ్యురాలు. కుట్టుమిషన్ ద్వారా ఉపాధి పొందే వారు. ఈమెకు వైఎస్సార్ చేయూత కింద రూ.55 వేలు, వైఎస్సార్ ఆసరా కింద రూ.16,500, సున్నా వడ్డీ కింద రూ.5,320 వచ్చింది. బ్యాంక్ లోన్ రూ.2.30 లక్షలు, స్త్రీనిధి కింద రూ.50,000 ప్రకారం రూ.3,39,320 సమకూరాయి. ఈ నిధులతో గోనెగండ్లలో దుస్తుల దుకాణం ఏర్పాటు చేసుకున్నారు. వ్యాపారం కూడా బాగా జరుగుతోంది.

జీవన వికాసం

- మహిళల ఆర్థికాభివృద్ధికి చేయూతనిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం
- వివిధ పథకాల కింద రూ. వెయ్యి కోట్ల ప్రయోజనం
- ఏటా బ్యాంకుల నుంచి రూ.700 కోట్ల లింకేజీ రుణాలు
- జిల్లాలో పెరిగిన జీవనోపాధులు
- వివిధ రంగాల్లో నారీమణుల రాణింపు

కర్నూలు(అగ్రికల్చర్): మహిళల జీవన ప్రమాణాలను పెంపొందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం విశేషంగా కృషి చేస్తోంది. జగనన్న తోడు, వైఎస్సార్ చేయూత, జగనన్న ఆసరా, వైఎస్సార్ సున్నా వడ్డీ పథకాలను పకడ్బందీగా అమలు చేస్తోంది. ఈ పథకాల కింద మహిళలకు 2019–20 నుంచి ఇప్పటి వరకు దాదాపు రూ.1000 కోట్లకు పైగా ఆర్థిక ప్రయోజనం చేకూరింది. ఒక వైపు ప్రభుత్వం ఆర్థికంగా తోడ్పాటు ఇస్తుండటం, మరోవైపు బ్యాంకులు ఉదారంగా రుణాలు పంపిణీ చేస్తుండడంతో మహిళల జీవనోపాధి మెరుగుపడింది. ఒకరిపై ఆధారపడకుండా మహిళలు వివిధ రంగాల్లో స్వశక్తితో రాణిస్తున్నారు.

పెరిగిన నైపుణ్యం

జిల్లాలో 34 వేల స్వయం సహాయక సంఘాలు ఉన్నాయి. వీటిల్లో 3.50 లక్షల మంది సభ్యులుగా ఉన్నారు. ప్రభుత్వం ప్రోత్సాహంతో మహిళలు స్వయం ఉపాధిలో రాణించడానికి ఆసక్తి చూపుతున్నారు. జిల్లా సమాఖ్య ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లో స్వయం సహాయక సంఘాల ఉత్పత్తుల, అమ్మకాల కేంద్రం ఏర్పాటైంది. ఇందులో 13 ఎస్‌హెచ్‌జీల మహిళలు ఉత్పత్తి చేసిన వాటిని విక్రయిస్తున్నారు. కోడుమూరులో నెలకొల్పిన మహిళా మార్ట్ రాష్ట్రానికే ఆదర్శంగా ఉండటం విశేషం. ఆలూరు, ఆస్పరి ప్రాంతాల్లో స్వయం సహాయక సంఘాల మహిళలు జీన్స్ పాయింట్ల తయారీ పరిశ్రమను నిర్వహిస్తూ పలువురికి స్ఫూర్తిగా నిలిచారు. జ్యూట్‌బ్యాగ్‌లు, ఊదిబత్తీల తయారీలోనూ నైపుణ్యాన్ని ప్రదర్శిస్తున్నారు. తీపి పదార్థాలు, వివిధ తినుబండరాలు తయారు చేసి దుకాణాలకు సరఫరా చేస్తున్నారు. పసుపు, కారం పొడి మిషన్‌లు ఏర్పాటు చేసుకొని, వాటిని ప్యాక్ చేసి మార్కెట్‌లోకి విడుదల చేస్తున్నారు. పొట్టేళ్ల, పెరటికోళ్ల పెంపకంలో రాణిస్తున్నారు. పొదుపు సంఘాల్లో 3.50 లక్షల మంది మహిళలు ఉండగా, దాదాపు 90 శాతం మహిళలు ఏదో ఒక నైపుణ్యాన్ని పెంచుకొని, వివిధ వృత్తుల్లో రాణిస్తున్నారు.


కలెక్టరేట్‌లో ఏర్పాటైన మహిళా ఉత్పత్తుల కేంద్రం

బ్యాంకుల క'రుణ'

రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు బ్యాంకులు పొదుపు మహిళలకు పెద్ద ఎత్తున రుణాలు ఇస్తున్నాయి. రికవరీ కూడా ఆశాజనకంగా ఉంటోంది. లింకేజీ రుణం కింద ఒక సంఘానికి గరిష్టంగా రూ.20 లక్షలు ఇస్తున్నారు. ఈ ఏడాది ఇప్పటి వరకు రూ.700 కోట్లు వరకు బ్యాంకులు లింకేజీ రుణాలు ఇచ్చాయి. అన్ని వైపుల నుంచి ఆర్థిక తోడ్పాటు లభిస్తుండటంతో మహిళలు చిన్నతరహా పరిశ్రమలు ఏర్పాటు చేసుకుని రాణిస్తున్నారు. అర్హతలను బట్టి ఉన్నతి, స్త్రీ నిధి కింద కూడా రుణాలు లభిస్తున్నాయి.

ప్రభుత్వ తోడ్పాటు ఇలా...

- వైఎస్సార్ ఆసరా కింద 2019 నుంచి 2023 వరకు ఏటా 18 వేల సంఘాలకు రూ.90 కోట్లకుపైగా ప్రయోజనం.
- వైఎస్సార్ సున్నా వడ్డీ కింద మూడేళ్లలో ఏటా 29 వేల సంఘాలకు రూ.108 కోట్ల ప్రయోజనం.
- జగనన్న తోడు కింద ఏటా 10 వేల సంఘాలకు రూ.40 కోట్ల లబ్ధి .
- వైఎస్సార్ చేయూత కింద 45 నుంచి 60 ఏళ్ల లోపు మహిళలకు ఏటా రూ.18,870 ప్రకారం చెల్లింపు. 2020–21లో 1,11,316 మందికి, 2021–22లో 1,20,106 మందికి, 2022–23లో 1,24,045 మందికి రూ.666.50 కోట్ల లబ్ధి.

మహిళా సాధికారతకు ప్రభుత్వం పెద్దపీట



మహిళా సాధికారతకు రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తోంది. వివిధ పథకాలు అమలు చేస్తూ వారికి ఆర్థిక ప్రయోజనం కల్పిస్తోంది. గతంలో మాదిరి కాకుండా బ్యాంకులు కూడా ఉదారంగా రుణాలు ఇస్తున్నాయి. దీంతో మహిళలు వివిధ వ్యాపారాలు, వృత్తుల్లో విశేషంగా రాణిస్తున్నారు. కోడుమూరులో నెలకొల్పిన వైఎస్సార్ చేయూత మహిళా మార్ట్‌లో రోజుకు రూ.లక్ష వ్యాపారం జరుగుతోంది.

– వెంకటసుబ్బయ్య, పీడీ, డీఆర్‌డీఏ-వైకేపీ

తుంగభద్ర నదిలో గుర్తు తెలియని మృతదేహం



కర్నూలు: కర్నూలు నగరం రోజా వీధి సమీపంలోని ధోబీ ఘాట్‌లో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం బయటపడింది. ధోబీ ఘాట్‌లో నీటిపై మంగళవారం మృతదేహం తేలియాడుతుండగా స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. రెండవ పట్టణ పోలీసులు అక్కడికి చేరుకుని నీటిలో తేలియాడుతున్న మృతదేహాన్ని వెలికితీశారు. సుమారు 48 ఏళ్ల వయస్సు ఉండి 5.2 అడుగులు ఎత్తు ఉంటాడు. సమీపంలోనే రెండు జతల దుస్తులు లభించాయి. ఎడమ చేతిపై పాత గాయం ఉంది. ఆచూకీ తెలిసిన వారు సమాచారమివ్వాలని రెండవ పట్టణ పోలీసులు విజ్ఞప్తి చేశారు.

మోటార్ల దొంగలు దొరికారు

- ఆరుగురు అరెస్ట్
- రెండు ట్రాక్టర్లు, మూడు మోటర్లు స్వాధీనం

గోనెగండ్ల: మండలంలో కొన్ని రోజులుగా చోరీలకు పాల్పడుతున్న దొంగలను మంగళవారం గోనెగండ్ల పోలీసులు అరెస్టు చేశారు. సీఐ మంజునాథ్, ఎస్‌ఐ తిమ్మారెడ్డి స్థానిక పోలీసు స్టేషన్‌లో వెల్లడించిన వివరాల మేరకు.. భారత్ గ్యాస్ గోడౌన్ దగ్గర వాహనాల తనిఖీ చేస్తుండగా అనుమానాస్పదంగా కనిపించిన ఆరుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకొని విచారించగా మండలంలో పలు చోరీలకు పాల్పడినట్లు తేలింది. గోనెగండ్ల మండలం ఐరన్‌బండ గ్రామానికి చెందిన పిక్కిలి మునిస్వామి, బోయ బజారి, అలాగే ఒంటెడుదిన్నె గ్రామానికి చెందిన బోయ మిన్నల్లా, ఎమ్మిగనూరు మండలం మల్కాపురం గ్రామానికి చెందిన బోయ మల్లికార్జున, కడిమెట్ల గ్రామానికి చెందిన బోయ అడవి కుమార్, తెలుగు రాజు దగ్గర నుంచి రెండు ట్రాక్టర్లు, ఒక ట్రాలీ, రోటోవేటర్, మూడు వ్యవసాయ మోటర్లు, ఏడు మాడకల నాగలిసెట్టు, క్రాస్ గుంటిక, ఒక మోటర్ సైకిల్‌ను స్వాధీనం చేసుకున్నారు. అలాగే వీటితో పాటు వెల్దుర్తి పోలీసు స్టేషన్‌లో కూడా ఒక ట్రాక్టర్, ట్రాలీ పోయినట్లు కేసు నమోదైందని, ఆ కేసుకు సంబంధించిన ట్రాక్టర్‌ను కూడా సీజ్ చేశామన్నారు. ఎమ్మిగనూరు టౌన్ పోలీసు స్టేషన్‌లో నమోదైన బైక్ చోరీ కేసుకు సంబంధించి బైక్‌ను స్వాధీనం చేసుకున్నామన్నారు. స్వాధీనం చేసుకున్న వాటి విలువ మొత్తంరూ.18.25 లక్షలుగా ఉంటుందని తెలిపారు. చోరీ చేసిన వస్తువులను దొంగలు తక్కువ ధరకు అమ్మి జల్సాలకు పాల్పడుతున్నారన్నారు. ఆరుగురిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలిస్తున్నామన్నారు. చోరీ కేసును ఛేదించిన గోనెగండ్ల ఎస్‌ఐ తిమ్మారెడ్డి, సిబ్బందికి రివార్డ్స్ ఇచ్చేందుకు ఉన్నతాధికారులకు నివేదికను పంపుతున్నట్లు సీఐ తెలిపారు.


దొంగలను అరెస్టు చూపుతున్న పోలీసులు

ట్రిపుల్ ఐటీ విద్యార్థులకు అస్వస్థత

కర్నూలు కల్చరల్: కర్నూలు ట్రిపుల్ ఐటీ విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వారం రోజుల క్రితం ఫుడ్ పాయిజన్‌తో 26 మంది అస్వస్థతకు గురి కాగా కళాశాలకు చెందిన వైద్య బృందం వారికి చికిత్స చేశారు. ఎలాంటి ప్రాణాపాయం జరగకపోవడంతో కళాశాల సిబ్బంది అందరూ ఊపిరి పీల్చుకున్నారు. ఈ విషయంపై ట్రిపుల్ ఐటీ డీఎమ్ డీవీఎల్ఎమ్ సోమయాజులును వివరణ కోరగా విద్యార్థులు అస్వస్థతకు గురైన మాట వాస్తవమే అన్నారు. ఆరోజు వండిన ఆహార పదార్థాల్లో కొంచెం మసాల ఎక్కువ కావడంతో ఘటన చోటు చేసుకుందన్నారు. తాము కూడా అక్కడే భోజనం చేశామని ఎలాంటి ఇబ్బంది కలగలేదని పేర్కొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తికి గాయాలు

వెల్దుర్తి: కర్నూలు - బెంగళూరు జాతీయ రహదారిపై పట్టణ సమీపంలో గుర్తు తెలియని వ్యక్తి తీవ్ర గాయాలై అపస్మారక స్థితిలో ఉన్నాడు. డోన్ వైపు నుంచి కర్నూలు వైపు వెళ్తూ వెల్దుర్తి సమీపంలోని ఈద్గా సమీపంలోకి రాగానే బైక్ అదుపు తప్పి కింద పడటంతో తీవ్ర గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న హైవే పోలీసులు సంఘటనాస్థలికి చేరుకుని క్షతగాత్రుడిని హైవే అంబులెన్స్‌లో కర్నూలు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. క్షతగాత్రుడి బైక్ బ్లూకలర్ ఫ్యాషన్ ప్రో (ఏపీ21 బిపి 5431) పరిశీలించగా డోన్ మండలం ఉడుములపాడు మాబుసాహెబ్ పేరుపై రిజిస్టర్ అయినట్లు తెలుస్తోంది. క్షతగాత్రుడిని గుర్తించే ఆధారాలేవీ లేవని, బైక్ అతనిదా లేక ఇంకొకరిదా, ఇతరత్రా విచారిస్తున్నామని, క్షతగాత్రుడు కర్నూలు ఆసుపత్రిలో అపస్మారక స్థితిలోనే ఉన్నాడని ఎస్‌ఐ చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు.



మానవత్వాన్ని చాటిన ఎమ్మెల్సీ

కర్నూలు(అగ్రికల్చర్): శాసనమండలి సభ్యుడు, రాయలసీమ విశ్రాంత ఐజీ ఇక్బాల్ కర్నూలు సీ.క్యాంపు సెంటరులోని డివిజినల్ సబ్ ట్రెజరీ కార్యాలయానికి మంగళవారం వచ్చారు. ఆయనను అధికారులు సాదరంగా ఆహ్వానించారు. సబ్ ట్రెజరీ అధికారులతో పెన్షన్ పేపర్ల విషయమై మాట్లాడుతుండగా... ఇద్దరు విశ్రాంత ఉద్యోగులు వచ్చారు. వారు నిలబడలేని పరిస్థితిని గమనించిన ఎమ్మెల్సీ ఇగ్బాల్ తాను లేచి నిలబడి వారికి సీటు ఇచ్చి మానవత్వాన్ని చాటుకున్నారు. ఆయన మంచితనంపై ట్రెజరీ ఉద్యోగులు, విశ్రాంత ఉద్యోగులు హర్షం వ్యక్తం చేశారు. ట్రెజరీ అధికారులు ఆయనకు పెన్షన్ పేపర్లు అందజేశారు.

వీధి ఆవులకు వైద్యసేవలు


ఆవులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

నంద్యాల(వ్యవసాయం): పట్టణ వీధుల్లో తిరుగుతూ అనారోగ్యంతో బాధపడుతున్న ఆవులకు పశువైద్యాధికారులు, మన ఊరు-మనగుడి, మన బాధ్యత సేవకులు మంగళవారం వైద్య సేవలందించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు గుంటూరు ఫ్యాక్టరీస్ ఆఫ్ ఇన్‌స్పెక్టర్ శివకుమార్‌రెడ్డి, పశువైద్యాధికారి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ కనుమ పండుగ అంటే పశువులను పూజించడంతో పాటు వాటికి సేవ చేయాలన్నారు.అందులో భాగంగా తాము సోమవా రం అర్ధరాత్రి వరకు పట్టణంలో తిరిగి ఆవులకు వ్యాక్సినేషన్, ఇంజెక్షన్లు, మాత్రలు అందించామన్నారు. కార్యక్రమంలో నిర్వాహకులు వెంకటేష్, సుబ్బారెడ్డి, బాదుల్లా తదితరులు పాల్గొన్నారు.

ప్రేమపేరుతో వంచన

బొమ్మలసత్రం: ప్రేమ పేరుతో 13 ఏళ్ల బాలికను దగా చేసిన యువకుడిపై పోక్సో యాక్ట్ కింద పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. త్రీటౌన్ సీఐ నరసింహులు తెలిపిన వివరాల మేరకు దేవనగర్ సమీపంలో నివాసముంటున్న సుబ్రహ్మణ్యం బొమ్మలసత్రం వద్ద హెయిర్ కటింగ్ షాప్ నిర్వహిస్తున్నాడు. తన ఇంటి సమీపంలో 8వ తరగతి చదువుతున్న బాలిక వెంటపడి ప్రేమ పేరుతో లొంగదీసుకున్నాడు. గత సోమవారం బాలికకు కడుపు నొప్పి రావడంతో తల్లిదండ్రులు ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లారు. బాలిక గర్భం దాల్చి మూడు నెలలైనట్లు డాక్టర్లు నిర్ధారించడంతో తల్లిదండ్రులు ఆందోళనకు గురయ్యారు. బాలికను దండించగా సుబ్రహ్మణ్యం ప్రేమ పేరుతో తనని దగా చేశాడని వాపోయింది. బాలిక తండ్రి ఫిర్యాదు మేరకు సుబ్రహ్మణ్యంపై పోక్సో యాక్ట్ కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ట్రాక్టర్ కింద పడి చిన్నారి మృతి


భాను సురేంద్ర (ఫైల్)

కోవెలకుంట్ల: సంజామల మండలం మిక్కినేనిపల్లె గ్రామంలో మంగళవారం ట్రాక్టర్ కింద పడి ఒకటిన్నర సంవత్సరం వయస్సున్న భాను సురేంద్ర అలియాస్ నవనీత్ దుర్మరణం చెందాడు. స్థానికుల సమాచారం మేరకు.. గ్రామానికి చెందిన సురేంద్ర, సౌజన్య దంపతులకు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె సంతానం. కోవెలకుంట్ల పట్టణంలో ఫొటోస్టూడియో నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నారు. బంధువులకు చెందిన ట్రాక్టర్ ఇంజిన్‌ను ఇంటి బయట పార్కింగ్ చేసి ఉంచారు. సురేంద్ర పిల్లలతో పాటు మరికొంత మంది చిన్నారులు ట్రాక్టర్ ఎక్కి ఆడుకుంటున్నారు. స్టీరింగ్ పక్కన సైడు బ్యాగ్‌లో ఉన్న ఇంజిన్ తాళాలు బయటకు తీసి ట్రాక్టర్‌ను స్టార్ట్ చేయగా రివర్స్‌గేరులో ఉన్న ట్రాక్టర్ వెనుకకు కదిలింది. అప్పుడే ట్రాక్టర్ వద్దకు వస్తున్న భాను సురేంద్ర ట్రాక్టర్ వెనుక టైరు కింద పడటంతో ప్రమాదం చోటు చేసుకుంది. టైరు చిన్నారి కడుపుపైకి ఎక్కడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. కుమారుడు మృత్యువాతతో తల్లిదండ్రులు, బంధువులు కన్నీరు మున్నీరుగా విలపించారు.

నీటి సరఫరాలో ఇబ్బందులు రానీయొద్దు

కర్నూలు(హాస్పిటల్): నీటి సరఫరా విషయంలో రోగులకు ఇబ్బందులు రానీయొద్దని కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ జి.నరేంద్రనాథ్‌రెడ్డి చెప్పారు. మంగళవారం ఆయన ఆసుపత్రిలోని ఎంసీహెచ్, జనరల్ సర్జరీ, ఫిమేల్ మెడికల్ విభాగాలను తనిఖీ చేశారు. అనంతరం ఆసుపత్రిలో నెలకొన్న నీటి సమస్యపై అధికారులతో సమీక్షించారు. నీటి సమస్యపై యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టాలని ఏపీఎంఎస్ఐడీసీ ఇంజినీర్లను ఆదేశించారు. సమావేశంలో సీఎస్ఆర్ఎంఓ డాక్టర్ బి.వెంకటేశ్వరరావు, హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్ శివబాల నాగాంజన్, డాక్టర్లు కిరణ్‌కుమార్, ప్రశాంత్ పాల్గొన్నారు.

ఊరి నిండా ఎర్ర బంగారం!


ఎరుపెక్కిన మిరప కల్లాలు

- మిర్చి సాగులో కంబదహాల్ ప్రత్యేకం
- ప్రతి ఏటా అదే పంట
- దిగుబడి సాధనలో రైతులు పోటాపోటీ

మంత్రాలయం: పుడమి తల్లి ఆకు పచ్చ చీర కట్టినట్లుగా పల్లె చుట్టూరా పచ్చదనం. కుంకుమ బొట్టు పెట్టినట్లుగా అడుగడుగునా ఎర్రటి మిరప రాశులు. ఊరంతా ఎర్ర బంగారం (మిర్చి) సాగుచేస్తుండటంతో ఎటు చూసినా ఇవే దృశ్యాలు. ఎల్లెల్సీ నుంచి తుంగభద్ర జలాలు, అనుకూలమైన నేలలు, వాతావరణం కలిసిరావడంతో పెద్దకడబూరు మండలం కంబదహాల్ గ్రామ రైతులు మిరప సాగులో అదరహో అంటున్నారు. గ్రామ పరిధిలో మొత్తం 1,098 ఎకరాల సాగు భూమి ఉండగా, 525 మంది రైతులు ఉన్నారు. రబీ ప్రధాన పంటగా గ్రామ రైతులు మిరపను సాగు చేస్తూ వస్తున్నారు. గంగవరం డిస్ట్రిబ్యూటరీ కాలువను ఆనుకుని ఎక్కువగా ఎర్రమట్టి నేలలు ఉన్నాయి. మిరప సాగుకు ఇవి అనువైన భూములు కావడంతో రైతన్నలకు కలిసొచ్చే అంశం. గ్రామ కనుచూపుమేరా ఇక్కడ మిరప పైర్లు దర్శనమిస్తాయి. అంతగా ఇక్కడ రైతులు మిరప సాగుపై ఆసక్తి చూపుతున్నాయి. బహుశా జిల్లాలో ఎక్కడా లేనంతగా మిరప పంట సాగు. దిగుబడులు సాధనలో సిద్ధహస్తులు. ఒకరిద్దరు మినహా గ్రామంలోని ప్రతి రైతూ మిరప పంట వేస్తారు. అతితక్కువ విస్తీర్ణంలో ఇతర పంటలు సాగుచేస్తున్నారు. రెండో ప్రధాన పంటగా పత్తి, మొక్కజొన్న వేస్తారు.


మిరప దిగుబడులతో రైతు

కలిసొచ్చిన ధరలు..

మిరప పంటకు ఈ ఏడాది మంచి ధరలు ఉన్నాయి. డీలక్స్ రకాలు క్వింటం రూ.27 వేల వరకు పలుకుతోంది. నాసిరకం సైతం రూ.10 వేలకుపైగా ఉంది. గుంటూరు, హైదరాబాద్, కర్ణాటక బ్యాడిగి మార్కెట్లకు ఇక్కడి దిగుబడులను తరలిస్తారు. గ్రామంలో డీలక్స్‌తో పాటు తక్కువ పరిధిలో తేజ, బ్యాడిగి రకాలు వేశారు.

నియోజకవర్గం	మంత్రాలయం
మండలం	పెద్దకడబూరు
గ్రామం	కంబదహాల్(కంపాడు)
సాగు విస్తీర్ణం	1,220 ఎకరాలు
రబీ సాగు	1,098 ఎకరాలు
రైతులు	525
మిరపసాగు విస్తీర్ణం	673 ఎకరాలు

అందరూ మిరపనే



మా ఊర్లో ప్రధాన పంటగా ఎక్కువగా మిరప వేస్తారు. నాకున్న 6 ఎకరాల్లో మిరప వేశాను. అనుభవం కొద్దీ బాగానే పైర్లను చూసుకుంటున్నాం. ఇక్కడ వాతావరణం కూడా మిరపకు అనుకూలంగా కలదు. ఇప్పటికే 15 క్వింటాళ్లకు పైగా దిగుబడి తీశా. ధరలు సైతం ఆశాజనకంగా ఉన్నాయి.

– సోమశేఖర్, కంబదహాల్

మూడు ఎకరాల్లో సాగు చేశా



మా గ్రామంలో రైతులు పోటాపోటీగా మిరప వేస్తారు. పైర్లను కాపాడుకోవడంలోనూ అదే పంథా కొనసాగిస్తారు. మెరుగైన దిగుబడులు సాధించేందుకు పోటీపడతాం. నాకున్న 3 ఎకరాల్లో మిరప వేశాను. ఈ సారి మిరపకు మంచి రేట్లు ఉన్నాయి. ఇక్కడ ఎక్కువగా డీలక్స్ రకాలు అత్యధికంగా వేస్తాం.

– శ్రీనివాసులు, కంబదహాల్